చిట్టి మెదడుకు మంచి పదును

- గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులు
- సద్వినియోగం చేసుకుంటున్న విద్యార్థులు



విద్యార్థిని వేసిన వివిధ రకాల డ్రాయింగ్‌లు



వేసిన డ్రాయింగ్‌తో విద్యార్థులు



సమ్మర్ క్లాసుకు హాజరైన విద్యార్థులు



గ్రంథాలయంలో పట్టణ వాసులు



యోగా చేస్తున్న విద్యార్థులు

రేణిగుంట: వేసవి సెలవుల్లో శిక్షణ తరగతులకు వేల కు వేలు కట్టలేని పేద పిల్లల్లో నైపుణ్యాన్ని మెరుగు పరిచేందుకు మండల గ్రంథాలయంలో నిర్వహిస్తున్న శిక్షణ శిబిరం సత్ఫలితాలనిస్తోంది. మండల కేంద్రంలోని గ్రంథాలయంలో గత నెల 28వ తేదీ నుంచి జూన్ 6వ తేదీ వరకు వేసవి విజ్ఞాన తరగతులు నిర్వహిస్తున్నారు. ఉదయం 8 నుంచి 11 గంటల వరకు జరిగే శిక్షణ తరగతులకు సుమారు 25 మంది విద్యార్థులు హాజరవుతున్నారు. విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంపొందించే విధంగా పుస్తక పఠనం తోపాటు వారానికి రెండు రోజులు ఆటలు, రెండు రోజులు స్పోకెన్ ఇంగ్లిష్‌ను బోధిస్తున్నారు. కరాటే, యోగాలో శిక్షణ పొందిన కొందరు విద్యార్థులు గ్రంథాలయంలోని ఇతర విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. మెదడుకు పదును పెట్టే క్యారమ్ బోర్డ్, చెస్, డ్రాయింగ్ వేయడం పిల్లలకు నేర్పిస్తున్నారు. దిగువ మధ్య తరగతి వారు, ప్రైవేట్ పాఠశాలల్లో సమ్మర్ క్యాంపులకు ఫీజులు చెల్లించుకోలేని వారు గ్రంథాలయంలో నిర్వహించే శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారని శాఖ గ్రంథాలయాధికారి శ్రీముఖి తెలిపారు.

రెండేళ్లుగా హాజరవుతున్నా



గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులకు రెండు సంవత్సరాలుగా హాజరవుతున్నాను. ఇక్కడ పుస్తకాలు చదవడంతో పాటు చేతిరాత నైపుణ్యాన్ని పెంపొందించుకునేందుకు శిక్షణ ఇస్తున్నారు. దేశ భక్తిపై అవగాహన కల్పిస్తున్నారు. నాకు ఈ సమ్మర్ క్లాస్ ఎంతగానో ఉపయోగకరంగా ఉంది.
–దీప, ఏడో తరగతి, రేణిగుంట

డ్రాయింగ్ నేర్చుకుంటున్నా



ఇక్కడ జరిగే సమ్మర్ క్లాస్‌లో నేను డ్రాయింగ్ వేయటం చాలా బాగా నేర్చుకున్నాను. లైబ్రరీ మేడం, రమణ సార్ వాళ్లు మాకు నేర్పిస్తున్నారు. డ్రాయింగ్‌తో పాటు క్యారమ్ బోర్డ్, చెస్, యోగా వంటివి నేర్చుకుంటున్నాను. వేసవి సెలవుల్లో అందరి పిల్లలతో కలిసి ఇలా సరదాగా గడపటం చాలా ఆనందంగా ఉంది.
–కావ్య, 9వ తరగతి, రేణిగుంట

యోగా, కరాటే నేర్చుకుంటున్నా



ఇక్కడ జరిగే సమ్మర్ క్లాసులకు ప్రతిసారీ వస్తున్నాను. వారానికి రెండు రోజులు కరాటే, యోగా క్లాసులు నేర్పిస్తున్నారు. వీటితోపాటు లైబ్రరీలో ఉన్న పుస్తకాలు చదువుతున్నాం. ఇక్కడ చదువుతోపాటు కరాటే నేర్చుకోవడం హ్యాపీగా ఉంది. వేసవి శిక్షణ తరగతులు పూర్తయ్యే వరకు ప్రతిరోజు క్లాసులకు వస్తాను.
–భానుప్రకాష్, 8వ తరగతి, రేణిగుంట

గొప్ప అవకాశం



గ్రంథాలయంలో జరిగే వేసవి శిక్షణ తరగతుల వల్ల విద్యార్థుల్లోని నైపుణ్యాన్ని పెంచుకుంటున్నారు. పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఇదో గొప్ప అవకాశం. ఇక్కడి కొస్తున్న పిల్లలు చదువుతోపాటు ఆటలు, దేశ భక్తి పాటలు, వారికి అవసరమైన పద్యాలతోపాటు క్విజ్ పద్ధతిని నేర్చుకుంటున్నారు.
–ఓ వెంకటరమణ, జన విజ్ఞాన వేదిక నాయకులు, రేణిగుంట

శిక్షణ సద్వినియోగం



సమ్మర్ క్లాసులు క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నాం. మాగ్రంథాలయంలో 8 వేల పుస్తకాలు వరకు అందుబాటులో ఉన్నాయి. 1500 మంది సభ్యత్వం కలిగి ఉన్నారు. విద్యార్థులు ఈ శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకుంటున్నారు. వచ్చే నెల 6 వరకు క్లాసులు జరుగుతాయి.
–శ్రీముఖి, గ్రంథాలయ పర్యవేక్షకురాలు రేణిగుంట

క్లుప్తంగా

ఘనంగా కావమ్మ ఉత్సవం

ఏర్పేడు: మండలంలోని అముదూరు దళితవాడలో కావమ్మ అగ్నిగుండ ప్రవేశ మహోత్సవం ఆదివారం వేడుకగా నిర్వహించారు. ఈ వేడుకల్లో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కూనాటి రమణయ్య యాదవ్ అమ్మవారికి రూ.2,116 విరాళం అందజేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు, గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పల్లమాల గ్రామంలో సోమవారం ఉదయం 9 గంటలకు ఉచిత క్యాన్సర్ నిర్ధారణ, కంటి పరీక్షల శిబిరం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఆల్బనీ ఆంధ్ర అసోసియేషన్ సహకారంతో టాటా క్యాన్సర్ హాస్పిటల్ ద్వారా క్యాన్సర్ పరీక్షలు, శుక బ్రహ్మాశ్రమం భక్త కన్నప్ప కంటి ఆస్పత్రి ద్వారా కంటి పరీక్షలు జరుగుతాయని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు మెహన ఏకొల్ల 81792 12657 సెల్ నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

శ్మశానంలో చెత్తాచెదారం తొలగింపు



చెత్తాచెదారం తొలగిస్తున్న జేసీబీ

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని శ్మశానంలో ఉన్న చెత్త, చెదారాన్ని ఆదివారం ఉప సర్పంచ్ మునిరాజా జేసీబీ యంత్రంతో తొలగించారు. శ్మశానంలో చెత్త, చెదారం ఉండడంతో మృతదేహాలను పూడ్చడానికి గ్రామస్తులు తీవ్ర ఇబ్బంది పడుతుండడంతో చెత్త, చెదారాన్ని తొలగించినట్లు ఆయన ఈసందర్భంగా తెలిపారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

దళిత విద్యార్థిపై దాడి హేయం

తిరుపతి కల్చరల్: విద్యానికేతన్ ఇంజినీరింగ్ కళాశాలలో ఫైనల్ ఇయర్ చదువుతున్న జేమ్స్‌ను చంపేందుకు ప్రయత్నించడం దారుణమైన చర్య అని, ఈ దుర్మార్గానికి పాల్పడిన రౌడీషీటర్ సాయిరూపేష్, బోటా బ్లేడ్ గ్యాంగ్‌లపై కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. హత్యాయత్నానికి పాల్పడిన వారిపై తిరుచానూరు పోలీసులు నామమాత్రపు కేసు నమోదు చేయడం విడ్డూరమన్నారు. కులం పేరుతో దూషించి చంపేందుకు కుట్ర చేసిన వారిపై హత్యాయత్నం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. జేమ్స్‌కు న్యాయం జరిగే వరకు చేసే పోరాటంలో సీపీఎం ప్రత్యక్షంగా పాల్గొంటుందన్నారు.

పొట్టి శ్రీరాములు జయంతి



పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్యులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని బహదూరుపేటలో వెలసిన కన్యకాపరమేశ్వరి ఆలయం వద్ద ఆదివారం అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శ్రీపొట్టి శ్రీరాములు పవిత్ర స్మృతి రాష్ట్ర కార్యవర్గ ఉపాధ్యక్షులు ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శి అయితా మురళి మాట్లాడుతూ తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రం ఉండాలనే ఉద్దేశంతో ఆయన ఆమరణ నిరాహార దీక్ష చేశారన్నారు. ఆయన కృషితోనే ఆంధ్రరాష్ట్రం అవతరించిందని తెలిపారు. కార్యక్రమంలో పురుషోత్తం, మెంటా సుబ్బారావు, మోహన్, వెంకటరత్నం, వీపీ మూర్తి, కొండా సతీష్, ఐత శ్రీనివాసులు, కుందాం మోహన్, రమేష్, కొత్త సురేష్, వెంకటేష్, మధు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల చిరు కానుక



హెచ్ఎంకు నగదు ఇస్తున్న పూర్వవిద్యార్థులు

రేణిగుంట: ఉద్యోగరీత్యా ఎక్కడెక్కడో స్థిరపడి కాల చక్రంతో పరిగెడుతున్న 1983–84 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు పాఠశాలకు చిరు కానుకను అందించారు. రేణిగుంట జిల్లా పరిషత్ హైస్కూల్లో జాతీయ నాయకులు, శాస్త్రవేత్తల చిత్రపటాల కొనుగోలుకు అవసరమైన రూ.15,000 సాయాన్ని ఆదివారం పాఠశాల హెచ్ఎంకు అందజేశారు. కార్యక్రమంలో వెంకటేశ్, అడ్వకేట్ జాకీర్ హుస్సేన్, సూరిబాబు, శేఖర్, కుమార్, ఆర్.ఎం రఫీ ఉల్లా, రవి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఏఎంసీ మాజీ డైరెక్టర్ మృతికి సంతాపం



కళత్తూరు మునిరాజాకు నివాళులర్పిస్తున్న బియ్యపు మధుసూదన్‌రెడ్డి



నివాళులర్పిస్తున్న బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: పట్టణంలోని బహదూరుపేటకు చెందిన వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ కళత్తూరు మునిరాజా (68)ఆదివారం అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు అక్కడికి చేరుకుని కళత్తూరు మునిరాజా మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీవారి సురేష, పాలమంగళం రవి, కల్యాణి, సాధన మున్నా రాయల్, కంతా ఉదయ్‌కుమార్, చింతామణి పాండు ఉన్నారు.

నివాళి

శ్రీకాళహస్తి: పట్టణంలోని వరదరాజులస్వామి గుడి వీధిలో కేబుల్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న మల్లెంకొండ చలపతి తల్లి రాజేశ్వరమ్మ ఆదివారం అనారోగ్యంతో మరణించింది. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు అక్కడికి చేరుకుని ఆమెకు నివాళులర్పించారు. ఆమె కుటుంబానికి తమ ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ

దారి ఆక్రమణ



పాపానాయుడుపేటలో అక్రమ నిర్మాణం

ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేటలో పంచాయతీ దారిని ఆక్రమించి ఓ వ్యక్తి అక్రమ నిర్మాణం చేపడుతున్నట్లు స్థానికులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పాపానాయుడుపేట ధర్మరాజస్వామి దేవాలయం సమీపంలో పెన్నగడ్డంకు వెళ్లేమార్గం పంచాయతీ రోడ్డుగా ఉంది. అయితే ధర్మరాజస్వామి ఆలయం పక్కనే మురుగప్ప మొదలి అనే వ్యక్తి దాతల సహాయంతో ఓ ఆలయాన్ని నిర్మించారు. రెండు ఆలయాల మధ్యన ఉన్న ఈ దారిలో రెండు సెంట్లు స్థలాన్ని ఆక్రమించి కారు పార్కింగ్ కోసం అక్రమ నిర్మాణం చేపడుతున్నారు. ఈ నిర్మాణంతో అటువైపు వెళ్లే గ్రామస్తులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, అధికారులు అక్రమ కట్టడాలను కూల్చివేసి ప్రభుత్వ ఆస్తిని పరిరక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

లారీలతో ఇక్కట్లు



సర్వీసు రోడ్డులో అడ్డంగా నిలిపివేసిన లారీలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి మండలంలోని ఇసుకగుంట వద్ద శీతల పానీయాల పరిశ్రమకు చెందిన రవాణా చేసే వాహనాలు అక్కడ సర్వీసు రోడ్డులో నిలిపి ఉంచుతుండడంతో గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆర్టీసీ బస్సులు కూడా వెళ్లేందుకు అవకాశం లేకుండా వాటిని రోడ్డు మీద ఉంచడంతో ప్రయాణికులు సైతం మండిపడుతున్నారు. రాత్రుల్లో లారీ డ్రైవర్లు ఆ రోడ్డులోనే అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ తరచూ గ్రామస్తులతో గొడవలకు దిగుతున్నట్లు సమాచారం. సర్వీసు రోడ్డు మొత్తం పొడవునా ఈ వాహనాలే ఉండడంతో ప్రమాదాలకు కూడా ఆస్కారమిచ్చేలా ఉంటోంది. దీనిపై పరిశ్రమ యాజమానానికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, ఉన్నతాధికారులైనా దీనిపై దృష్టి సారించి రోడ్డు మీద పార్కింగ్ చేయకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

నాగలాపురం: మండలంలోని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల 2001–02 సంవత్సరం పదో తరగతి చదివిన విద్యార్థులు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్లేస్‌లో ఆదివారం సమావేశమయ్యారు. తీపి జ్ఞాపకాలను ఒకరికొకరు గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. అనంతరం పూర్వ విద్యార్థులు తమకు విద్య నేర్పిన ఉపాధ్యాయులందరినీ ఘనంగా సన్మానించి, బహుమతి ప్రదానం చేశారు. ఎంఈఓ శ్రీదేవి, రేఖ, పూర్వ విద్యార్థులు హేమంత్, యోనస్, జగదీష్, బాలాజీ, మణికంఠన్, మునివేలు పాల్గొన్నారు.

వేడుకగా కల్యాణ వెంకన్న రథోత్సవం



కల్యాణాన్ని జరిపిస్తున్న ఆలయ అర్చకులు





తిరువీధుల్లో శ్రీవారి రథం, అశ్వవాహనంపై కల్కిగా కల్యాణ వేంకటేశ్వరుడు

నారాయణవనం: శ్రీపద్మావతీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో ఆదివారం ఉభయ నాంచారులతో రథోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. రాత్రి అశ్వవాహనాన్ని అధిరోహించిన స్వామి, అమ్మవారు మాడవీధుల్లో విహరించి, శ్రీదేవి, భూదేవి, పద్మావతీ అమ్మవారితో కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. వేకువ జామున ఒంటి గంటకు సుప్రభాతసేవతో నిత్యపూజా కార్యక్రమాలను పూర్తి చేశారు. 3.15 గంటలకు దేవరులతో కలిసి వేంకటేశ్వరస్వామి తిరుచ్చి వాహనంలో రథ మండపానికి చేరుకున్నారు. వాస్తు, శాంతి పూజలు అనంతరం రథాన్ని అధిరోహించారు. 7.45 గంటలకు బయల్దేరిన శ్రీవారి రథం భక్తుల గోవింద నామస్మరణల మధ్య గంగుండ్ర మండపానికి 11 గంటలకు చేరుకుంది. తిరిగి 2 గంటలకు బయల్దేరిన శ్రీవారి రథం 4 గంటలకు గమ్యస్థానానికి చేరుకుంది. సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం రథంలో స్వామివారిని దర్శించుకుని, రథాన్ని లాగారు. ఆలయానికి చేరుకున్న ఉత్సవమూర్తులకు ఏకాంతంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం క్షత్రియదారుడై వెంకన్న అశ్వవాహనాన్ని అధిరోహించి దక్షిణ మాడ వీధికి చేరుకున్నారు. పద్మావతీ అమ్మవారి స్వర్ణాభరణాలను అపహరించిన తిరుమంగై ఆళ్వార్‌ను వెంటాడి ఆభరణాలను విడిపించిన ఘట్టం భక్తులకు కనువిందు చేసింది.

కల్యాణం కమనీయం

రాత్రి 8.30 గంటలకు ఆలయ వాహన మండపంలో శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామికి శ్రీదేవీ, భూదేవీ, పద్మావతీ అమ్మవార్లతో ఆర్జిత కల్యాణోత్సవాన్ని అర్చకులు వైఖానస ఆగమోక్తంగా నిర్వహించారు. పద్మావతీ అమ్మవారిని శ్రీనివాసుడు వివాహమాడిన క్షేత్రం నారాయణవనంలో మాత్రమే ఉభయ దేవరులతోపాటు పద్మావతీ అమ్మవారికి వేంకటేశ్వరస్వామితో కల్యాణోత్సవాన్ని నిర్వహించడం విశేషం. అనంతపురం, కడప జిల్లాల నుంచి అధిక సంఖ్యలో పద్మశాలీలు కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. డిప్యూటీ ఈఓ నాగరత్న, ఏఈఓ రవి, సూపరింటెండెంట్ ధర్మయ్య, ఇంజినీరింగ్ శాఖ ఈఈ మల్లికార్జున ప్రసాద్, డిప్యూటీ ఈఈ భాస్కర్, ఆలయ అధికారి నాగరాజు, ఏఈ గురుమూర్తి పర్యవేక్షించారు. ఉత్సవాలలో చివరి రోజైన సోమవారం ఉదయం పద్మసరస్సులో చక్రస్నానం, సాయంత్రం ధ్వజావరోహణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధరభట్టాచార్య తెలిపారు.

ఏపీ జీఎంపీ నూతన కమిటీ ఎన్నిక



ఎన్నికైన జీఎం సభ్యులతో డాక్టర్ వివేక్

శ్రీకాళహస్తి: పట్టణంలోని ఎంజీఎం హాస్పిటల్లో ఆదివారం ఏపీ జీఎంపీ (ఆంధ్రప్రదేశ్ గ్రామీణ మెడికల్ ప్రాక్టీషనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్) సభ్యుల సర్వసభ్య సమావేశం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరిగింది. దీనికి ఎంజీఎం హాస్పిటల్ గుండె వైద్య నిపుణులు డాక్టర్ వివేక్ హాజరయ్యారు. ఆయన జీఎంపీ సభ్యులకు గుండెకి సంబంధించిన వ్యాధులపై అవగాహన కల్పించారు. అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శ్రీకాళహస్తి డివిజన్ ఏపీ జీఎంపీ అధ్యక్షుడిగా ఎం వెంకటేశ్వర్లు, జాయింట్ సెక్రటరీగా టి.సురేష్ రెడ్డి, ట్రెజరర్‌గా వీరయ్య, ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్లుగా రాంబాబు, బాలాజీ, తులసమ్మ, నాగరాజు నాయుడు, రాజేంద్రకుమార్ రెడ్డి, ఎస్ ఎం బాషను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కేఎస్ రాజు, జిల్లా సెక్రటరీ ఏడుకొండలు, అసోసియేషన్ సీనియర్ సభ్యులు మోహన్, శివశంకర్, మాల్యాద్రి, కల్యాణ్ రాజు అధిక సంఖ్యలో జీఎంపీ సభ్యులు పాల్గొన్నారు.

రెవెన్యూను లెక్క చేయని ఆక్రమణదారులు

రేణిగుంట: రెవెన్యూ రికార్డుల్లో ప్రభుత్వ భూమిగా ఉన్న స్థలంలో కొందరు తమకు పత్రాలు ఉన్నాయని చెబుతూ హెచ్చరిక బోర్డును నాటారు. రెవెన్యూ సిబ్బంది హెచ్చరిక బోర్డును తొలగించడంతో ఆదివారం తెల్లవారుజామున ట్రాక్టర్‌తో భూమిని చదును చేశారు. మండలంలోని కొత్తపాళెం రెవెన్యూ గ్రామంలోని సర్వే నంబర్ 99లో పాత విమానాశ్రయం రహదారి పక్కనే ఉన్న ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు కొందరు గత పది రోజులుగా ప్రయత్నిస్తున్నారు. ఆ భూమికి హైకోర్టు ఆర్డర్లు ఉన్నాయని హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. రెవెన్యూ అధికారులు ఆ బోర్డును తొలగించడంతో ఆదివారం ఉదయం భూమిని చదును చేశారు. రెవెన్యూ అధికారులు సంఘటన స్థలానికి చేరుకునే లోపే వారు అక్కడ నుంచి జారుకున్నారు. కోట్లు విలువచేసే ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం అవకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు. అధికార పార్టీ నియోజకవర్గ పెద్దల అండదండలతోనే ఇదంతా జరుగుతా ఉందని విమర్శలు వినబడుతున్నాయి. రేణిగుంట తహసీల్దార్ వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఫోను అందుబాటులో లేదు. వీఆర్వో స్పందిస్తూ ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చామని చెప్పారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం అది ప్రభుత్వ భూమిగానే ఉందని ఆమేరకు బోర్డు ఏర్పాటు చేస్తామని తెలిపారు.



ప్రభుత్వ భూమిలో ట్రాక్టర్‌తో చదును చేస్తున్న దృశ్యం

మురుగు నీటితో అవస్థలు



తిరుపతి రేణిగుంట ఫ్లైఓవర్ వద్ద రోడ్డుపై నిలిచిన మురుగునీరు



రైల్వే స్టేషన్, బస్టాండ్ మధ్యలో రోడ్డుపై నిలిచిన మురుగునీరు

రేణిగుంట: రెండు రోజులుగా రేణిగుంటలో కురుస్తున్న వర్షాల కారణంగా మురుగునీరు వర్షపునీటితో కలిసి రోడ్లపైకి రావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రేణిగుంట రైల్వేస్టేషన్ ప్రాంగణంలో మురుగునీరు నిలిచిపోయింది. శని, ఆదివారాల్లో కురిసిన వర్షానికి మురుగు కాలువలు పొంగి ప్రవహించాయి. తిరుపతి రేణిగుంట ఫ్లైఓవర్ వద్ద నీళ్లు నిలిచిపోవడంతో వాహన రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. ఓల్డ్ చెక్ పోస్ట్‌లో మురుగునీరు కలిసిన వర్షపు నీరు రోడ్డుపై ఉండడంతో ద్విచక్ర వాహనాలు వెళ్లడానికి వీలులేని పరిస్థితులు నెలకొంది. ఓల్డ్ చెక్‌పోస్ట్ సమీపంలోని అండర్ బ్రిడ్జ్‌లో మురుగునీరు రావడంతో ద్విచక్ర వాహనదారులు అవస్థలు పడుతున్నారు. కనీస ముందస్తు చర్యలు తీసుకోకుండా పంచాయతీ అధికారులు కాలయాపన చేస్తున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు.



ఓల్డ్ చెక్‌పోస్ట్ అండర్ బ్రిడ్జ్ కింద నిలిచిన మురుగునీరు

చలివేంద్రం ఏర్పాటు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని అరిగిలకండ్రిగ గ్రామం కేటీరోడ్డు సమీపంలోని బస్టాండు వద్ద ఆదివారం మండల వైఎస్ఆర్‌సీపీ కన్వీనర్ కొణతనేని మణినాయుడు సహకారంతో సర్పంచ్ సిద్ధమ్మ తాగునీటి చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వీఎస్‌పురం, అరిగిలకండ్రిగ గ్రామం దళితవాడ, గిరిజన కాలనీలకు చెందిన గ్రామస్తులు బస్సుల కోసం బస్టాండు వద్దకు వస్తుంటారని, ఎండాకాలం కావడంతో తాగునీటి సమస్య లేకుండా ఉండడం కోసం చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు. వేసవికాలంలో ఎండ వేడిమిని తట్టుకోవాలంటే తాగునీటిని ఎక్కువ తాగాలని తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



చలివేంద్రంలోని నీటిని తాగుతున్న గ్రామస్తులు